నిజమే... రాళ్లను పిండిగా మారుస్తుంటే గాల్లోకి లేచిన ఆ రాళ్లదుబ్బ పొలాల మీదకు ఎగజిమ్ముతోంది. పొలాల మట్టి బూడిద చల్లినట్లుగా అవుతోంది. అది క్రమంగా గట్టిపడి పరుపుబండలాగా అయితే... తమ పొలాలు...??

నర్సయ్యకు పూర్తిగా అర్థమైనంక... ఆవేశమాగ లేదు.

"రాయే బాపు... సర్పంచిగాని దగ్గరకు పోయి అడుగుదాం," అన్నాడు.

"నువ్వెల్లు బిడ్డా... నాకు వూర్లెకి రాబుద్ధయిత లేదు..." చెప్పిండు దీనంగా. నర్సయ్య ఆవేదనగా, ఆవేశంగా ఊర్లోకి నడిసిండు.

అడ్డగుట్ట తర్వాత బోడగుట్ట దగ్గరి పాడువడ్డ బాయిల ఉలిని, సుత్తిని ఇసిరేసిండు వీరాచారి. అటెనుక... 'దేవుడా... ఇగ బతుకద్దురా...' అనుకుంట దునికిండు.

ఆ రాత్రి నర్సయ్యకు పాణమంత అగులుబుగులైంది. భార్యతోని అన్నడు, "ముసలోడు సచ్చిపోతడను కోలేదే... రాంగవోంగ మందలిచ్చెటోడు... క్రషర్ మిషన్ కాంట్రాక్టర్‌గాడు ఊరికి ఇరువై వేలియ్యంగనే... గుట్టనే అప్పజెప్పింండ్రు."

"మన పొలం గతెట్ల..." అంది నర్సయ్య భార్య.

నర్సయ్యకు ఏం జెయాల్నో అర్థంకాలేదు. 'పొలాన్ని కాపాడుకోవాలె,' అని నిద్రవోలేదు.

అద్మరాత్రి... పెట్రోలు క్యాన్ తీసుకొని పోయిండు...

చిమ్మెట్ల సప్పుడు తప్ప అంత నిశ్శబ్దంగా వుంది... అక్కడున్న నాలుగు ట్రాక్టర్లలోంచి ఒక ట్రాక్టర్ని తీసుకొని వీరాచారి ఇంటికి పోయిండు. అక్కడి విగ్రహాల్లోంచి ఆంజనేయుని విగ్రహాన్ని ట్రాక్టర్ ట్రైలర్‌లోకి అతి కష్టంగా ఎక్కించాడు. గుట్ట మీదికి తీసుకెళ్లి నిల్పోబెట్టిండు.

నాలుగు ట్రాక్టర్ల మీద పెట్రోల్ వోసిండు... అగ్గి పుల్ల గీసిండు.

ఒక్కసారి ఆ ఏరియంత భగ్గుమన్నది. భూమి బద్దలైనంత విస్ఫోటనాలు... ట్రాక్టర్లు కాలుకుంట మంటల్లేసినయ్...

'నీయవ్వ... నాకు నా పొలం దక్కాలె... అందరి పొలాలు దక్కాలె... రైతు బతుకాలె...'

తుర్తిగా ఊర్లెకి నడిసిండు.

*

తెల్లారంగ ఊరంతా కదిలచ్చింది... మంటలల్ల ఆంజనేయుడు ఉగ్ర అవతారంగా కన్పించిండు.

ఊరంతా పొర్లు దండాలు పెట్టింది.

ఇప్పుడు బోడగుట్ట ఆంజనేయ దేవాలయం ఒక పుణ్యక్షేత్రం.

*నమస్తే తెలంగాణ 'బతుకమ్మ', 13 జనవరి 2013*

